ప్రయాణం

★

శ్రీ అంగర వెంకటకృష్ణారావు

హౌరా ప్లాట్ ఫారం మీద జనసమూహాన్ని తోసుకొంటూ యే పెట్టెలో దూరడమా అని ఆతృతగా తిరుగుతున్నాను. మెయిలు షెడ్డులోంచే పొరుగూరునుంచి వచ్చినట్టు నింపుగా వచ్చి ఆగింది.

నా బుజ్జమీంచి యెవరో సూటుకేసు పెట్టడానికి ప్రయత్నిస్తూ చెయ్యి పీకెట్టిందికాబోసు నా తల మీదే దానిని ఆనించి, విశ్రాంతి తీసుకుంటున్నారు. 'ఇదేమిటయ్యా' అని నేను అతని వేపు తిరగబోతే, ఆబగావుకు మెడనరం కరాలుమంది.

ఈలోగా వొక అరవసోదరి వెదురు విసనకఱ్ఱలు కట్టిన పెద్దసజ్జ అంతకుముందే పెట్టెలో ప్రవేశించిన ఆసామీ (భర్తగావును) కి అందిస్తూ విసనకఱ్ఱకాడతో నా చెంప రక్కి అదిచాలక మెట్టనుకుందేమో నా జోడుమీద యెత్తుమడిమల జోడుతో నొక్కుతూంది.

నా పరిస్థితి యేమీ బాగులేదు. అటు కదిలితే సూటుకేసు మళ్లీ తలమీద పడుతుంది. ఇటు కదిలితే విసనకఱ్ఱకాడ కంట్లో గుచ్చుకుంటుంది.

ఈ ప్రాణాంతకసమయంలో వొక బలమైన చెయ్యి నా భుజాన్ని పట్టి వూపింది. నా వళ్లు మండి తలపైకెత్తి తిడుతూ చూసేను. వాడు మా కామేశ్వరి. సముద్రపు హోరువంటి జనసముద్రపుహోరులో వాడేమంటూన్నదీ వినిపించడంలేదు. కాని అలా చూస్తూనే వున్నాను. అరవసోదరి అరవంలో తిడుతూ అవతలకు తుళ్లింది. సూటుకేసు ఆసామీ 'వాట్ వాట్' అంటూ అటువెంపు యింగఙ్ కొట్టేడు. కిటికీద్వారా నేనూ, నా హోల్డాలు, ట్రంకుపెట్టె కంపార్టుమెంటులో ప్రవేశించాం. ప్రవేశించామేమిటి, కామేశ్వరిలాగేశాడు. అలాగేయడంలో వాడికి, నాకూ హోల్డాలుకూ యేమీ వ్యత్యాసంవున్నట్టు గోచరించలేదు.

మొత్తానికి ప్రవేశించవలసినవారంతా పెట్టెలో ప్రవేశించారు. మెయిలు, కదిలింది.

'ఏమిరా రాజా, నీ మిలిటరీ డాబంతా యింతేనా? అలా చూస్తూనుంచుంటావేం?'

'అబ్బే, రావటం లేటయింది. అప్పటికే జనం తోక్కుకుంటున్నారు'

మూరెడుపొడుగు చుట్ట నోట్లోంచి తీసి నవ్వుతూ వాడేదో తిట్టేడు. వాడిసంగతి తెలుసును గనక తిట్టేడని గ్రహించేను. బండీ అప్పుడే యేదో చిన్న వంతెనమీంచి పరుగెడుతూ పెడుతూన్న బొబ్బలలో యితర శబ్దం వినిపించడం లేదు.

ఆ మసకవెలుతురులో దట్టమైన యింజను పొగ వెనకనుంచి యీతచెట్లు తలలు విరబోసుకున్న దయ్యాల్లా అగుపిస్తున్నాయి.

'రాజా. నాటికి నేడే నీదర్శనం. ఎక్కడెక్కడ తిరిగావురా యిన్నాళ్లూ? ఎంతమందిని చంపావు?'

'ఎవర్ని చంపడం? ఎందుకు?'

వాడు నవ్వి నా భుజంమీద మామూలుగా తట్టేడు. ఆ అదురుకు అంతవరకూ బాధిస్తూన్న తల నొప్పి సర్దుకుంది. అదీ వొక మంచికే అనిపించింది.

'కాదురా మరి, నువ్వు యోధుడివికదూ. అన్నట్టు మరిచిపోయేను...చుట్ట కాలుస్తావా ... మంచిదే ... స్పెన్సరు...పోనీ ... మారి...యెప్పుడు చేరేవు?'

'నలభైలో'

'మరి యీ యేడేళ్లూ యేంజేస్తున్నావురా. నువ్వు జమాయిస్తావనుకున్నాను. అలాగే వున్నావు.'

మెయిలొకదగ్గర విధిలేక ఆగింది. ఈలోగా మావాడా చుట్ట పారేసి మరొక మూరెడు చుట్ట వెలిగించేడు. నేనీ యేడేళ్లలోనూ ఆరేళ్లు ఖైదీగా జీవించిన సంగతి తెలిసి విచారించేడు.

'మన విశ్వం యెక్కడున్నాడురా ?'

'ఎవడు ... వాడా పొట్టివాడు ... ఫ్రెంచి కటింగు.......ఏం మనిషిరా...ఇప్పుడా....బరంపురంలో వున్నాడులా వుంది. వాళ్లత్తవారిది బరంపురమేగా.'

'కామేశ్వరీ, వాడిని చూడాలని కళ్లు కాయలు కాసిపోయేయిరా. ఎన్నో వుత్తరాలు వ్రాశాను. జపానీవాళ్లు సరిగానే పంపేవారట. తెల్లవాళ్లే చింపి పారేసేవారట.'

కాదు గానీ, ఆవిశ్వం నలభైసూడులో కలకత్తా వచ్చేడురా. అప్పుడే ఇంగ్లండునుంచి ప్రొఫెషనల్ ఫుట్‌బాలర్స్‌వచ్చారు. ఆఆటలు చూడడానికివచ్చాడు చూడ్డానికి వచ్చినవాడు మెల్లిగా జాగా సంపాదించి, వాళ్లతో ఆడేడు సుమీ. ఒరేయ్! ఇంతుండే వాడా...బంతికన్న తుప్పున తుళ్లేవాడురా!

'వాడి యెడ్రసు తెలుసునా...నిజం నమ్ముమీ. ఖైదులో వున్నప్పుడు మా అన్నయ్య కూడా జ్ఞప్తికి రాలేదు కాని వాడే తరుచు జ్ఞాపకానికివచ్చి బాధించేవాడు...'

'వాడి యడ్రసుకేం గాని...'

'ఏం గాని కాదు తెలిస్తే చెప్పరా...'

'తెలీదురా నీ..: కాని వాడిఫ్రెంచి కటింగూ ...నవ్వు నోరూ...ఎప్పుడూ చిదానందమేరా వాడి తస్సా...!

పెదవిమీద రాశుసిబొగ్గరవ్వ ఫెడీమని తగిలింది.

'ఆ యేడే వాళ్ళనాన్న పోయేడుసుమీ'

'ఆఁ!!'

'పాపం యేదో ఆ ముసలాయనుంటే పింఛను వచ్చేది. ఇక వీడున్నాడా...ఎవడు...మన విశ్వం... ప్రతీ యేడాదీ ప్రోగ్రెసే...

మళ్ళీ మరొక రవ్వ కంటిమీద తగిలింది.

'రెండేసి రెండేసి...బ్రతికినవాళ్ళు బ్రతికేవారు, లేనివాళ్లు లేదు. నలభైమూడులో ఫుట్బాలు కోసం వచ్చినప్పుడు వాళ్లనాన్న పోయి రెండు నెలలయింది. పోయేడని నవ్వుతూ చెప్పేడు. అంటే నవ్వుతున్నాడని మరోలా కాదు. అదే ... తండ్రి పోయిన సమాచారం చెపుతూన్నప్పుడు కూడా నవ్వే...

చుట్ట జారిపోయిందీమాటు నోటిలోంచి. మళ్లీ చుట్ట తగిలించి వుబికుబికి నవ్వుకున్నాడు. 'వాడూ వాడి ఫ్రెంచికటింగూ...యింత పిసరు మనిషీ.... చిదానందం...కాని యేం సిగరెట్లు కాల్చడం. తెగ కాల్చేవాడు. కాల్చడం దగ్గడం...బాగా జ్ఞాపకం చేశావు...విశ్వం గాడు...'

ఖరగ్‌పూరు దీపాలనుపిస్తున్నాయి.

'అన్నట్టు కామేశ్వరీ ... అడగడం మరిచిపోయాను...'

'నేనేం చేస్తున్నాననేనా ... ఖరగ్‌పూరులో సినిమా థియేటరు నడిపిస్తున్నా. ఇవాళ డిస్ట్రిబ్యూటర్లను కలుసుకుందికి కలకత్తా వచ్చా. ఉండరాదూ రెండురోజులపాటు నా దగ్గర.

రైలాగింది. కామేశ్వరి ఆ చుట్ట రైలుపట్టాల మీద విసరి మరో మూరెడు చుట్ట ముట్టించి 'గుడ్‌బై బ్రదర్' అని వెళిపోయేడు.

కామేశ్వరి వచ్చి నా గాయాన్ని కదిపేడు. ఈ యేడేళ్ల ప్రవాసంలో మానవప్రకృతి పొలిమేరలు గడిచిపోయిన నాలో బాధని తిరిగి రగిల్చేడు. ఈ యేడళ్లలో మా జానకి రెండో మూడో సారులు జ్ఞాపకానికి వచ్చింది. ఎప్పుడోవొక మాటు కామోసు మా రఘు ఈపాటికి నడుస్తూంటాడనుకొన్నాను.

ఖరగ్‌పూర్ ప్లాట్‌ఫారంకేసి చూస్తూంటే నా జీవిత పుస్తకపు పుటలు రెపరెప వెనుక్కు తిరుగుతున్నాయి. ఈ వూరికీ నాకూ చాలా సంబంధంవుంది. ఈ కార్మికాలయంలో కొంత కాలం వెళ్లబుచ్చేను. ఉద్యోగం లేని వొకానొక దుష్టకాలంలో యిక్కడి బ్రహ్మాండమైన కర్మాగారపు పొగగొట్టాలలోంచి ఆవిరిరూపం ధరించివచ్చే శ్రమజీవుల నెత్తురు మేఘాలతో మేలమాడుతూంటే, ఆశగా కళ్ళప్పజెప్పి చూసేను. స్వార్థం, లంచం ఆడే భయంకర నాటకంలో బాధితుడిపాత్ర ధరించి కార్చిన కన్నీటి కాల్వలింకా యింకనట్టు తోచడానికి కారణం నావంటి యెంతోమంది నేటికీ కన్నీళ్ల కారుస్తూండడంలా తోచింది. ఆకలికి నకనకలాడిన యెన్నో దినాలు ఈ కార్ఖానా కెదురుగా వున్న

రైల్వే వంతెన కొనాని అంటుకుపోయే - యొకప్పుడు.

ఈ ఆలోచనలలో యాదాలాపంగా నాదృష్టి యెదురుగావున్న మిఠాయిదుకాణంమీద పడింది కాని అక్కడ సామగ్రి యేదీ అగుపించడం లేదు. అప్పుడప్పుడు యెత్తు మడిమెలపాదాలు, ఆర్గండీ చీరలు, హనావా సూటులూ ఆదుకాణందగ్గరకు వచ్చి పోతూన్నది స్వాప్నిక వృత్తాంతంలా మాయ మాయగా గోచరిస్తూంది.

ఆమె మాటలు నాకు వినిపించడం లేదు. పొగ మంచువెనక కొండలా ఆమెఆకృతి చీకిరి బాకిరిగా వుంది. ఆమె చెయ్యి వూపి పిలుస్తూంది.

ఎవరూ ?

'ఏమండీ రాజారావుగారూ ! ఎంత పిలిచినా పలుకరు. సమాధిలో వున్నారా'

'ఓహో, లక్ష్మీ...క్షమించు...ఏదో ఆలోచిస్తున్నా. '

'యుద్ధంలోకి వెళ్లి వచ్చినా మీ ఆలోచనలింకా ముగియ లేదు. మని షాక దగ్గరా, మనసొక దగ్గరా...మీరింకా అలాగే వున్నారు.'

'ఏం లక్ష్మీ.....ఎక్కడికైనా వెడుతున్నావా ?'

'లేదండీ. మాతమ్ముడిక్కడే వున్నాడిప్పుడు. లోకో షెడ్డులో ఫోర్‌మన్. దిగండి, రెండురోజులుండి వెడుదురుగాని'

'అలాగే, దానికేంలేగాని, ఆరు సంవత్సరాలు పైగా ప్రవాసం తరవాత యిదే బైటకి రావడం. మనవాళ్లందర్నీ చూడాల్నివుంది. మళ్లీ వస్తాగా...'

'అలాగా, అయితే నేను పరాయిదానినా, ఇప్పుడు దిగకపోతే సంజీవితో చెప్పి మీ మీద దావా వేయిస్తాను. వాడి భార్యని మెయిలుకు దిగబెట్టడానికి వచ్చేను. పురిటికి విశాఖపట్టణం వెడుతూంది. వాళ్ల తమ్ముడు తీసుకెడుతున్నాడు.

'సంజీవి రాలేదా?'

'తీరిక లేదు. కాని మీరింకా అలాగే మాట్టాడుతున్నారే. దిగండి' ఇంజ నప్పుడే తగిలింది.

బలవంతాన దింపేసింది లక్ష్మీ. నేనూ లక్ష్మీ సామానుతో టాంగాలో నయాకాలనీకి బయలుదేరేం.

లక్ష్మీ! బాగా యెదిగిపోయింది. సన్నగా విల్లులా వంగిన ఆ కనుబొమ లిప్పుడు ముడిపడడం లేదు. విశాలమైన ఆ తళుకు నేత్రాలలో నిరాశ చిహ్నా లిప్పుడు వుండుండి పొడకట్టడం లేదు. ఆమె పెదవు లిప్పుడు రూపుదేరి బిగుసెక్కేయి. మాటి మాటికీ బరువుగా లేచిపడే ఆమెవక్షంలో నేడు శాంతి కాపురం పెట్టినట్టుంది.

'సీతారాం ! బాబుగారికి వేడినీళ్లు కాచు' అని హిందూస్తానీ కుఱ్ఱవాడితో చెప్పి ఆమె వంటలోకి జొరబడింది.

సంజీవి యింటిలో వాడు స్వంతంగా తయారు చేసిన వస్తువులు చాలా అగుపిస్తున్నాయి. వాడు పనివాడు, కార్ఖానాలో ఆఫీసరు. ఇల్లు చాలా అందంగా, యిమ్ముగా వుంది. గదుల గుమ్మాలకీ, కిటికీలకీ తెరలున్నాయి. టేబిల్సు, రకరకాల కుర్చీలు వున్నాయి. ఇంత సరంజాంవున్నా యిల్లు నిరాడంబరంగా వుంది.

ఉదయం యేడుగంటలకు సంజీవి వచ్చేడు. అంతకుముందే నేను కాఫీ త్రాగి తీరికగా కూచున్నాను. లక్ష్మీ సీతారాంను బజారుకు పంపింది. సంజీవి నన్ను చూసి నమ్మలేకపోయేడు. వాడిని నేను వెంటనే పోల్చ లేకపోయేను. ఈ ఆరేడేళ్లలోనూ యేనుగంత యేడు. తొడుక్కున్న మకిలి 'డాంగరీ' చేతులనిండా మసి, యినుపజోళ్లు, చెదిరిపోయిన వుంగరాల జుత్తు—వాడొక మరమనిషిలా వున్నాడు.

'ఏంరోయ్ రాజా ! హటాత్తుగా దిగబడ్డావే!'

'ఔనురా. నిన్న లక్ష్మీ స్టేషనుకు వచ్చింది మీ ఆవిడను దిగబెట్టడానికి—నన్ను బలవంతాన దింపేసింది కాని యీ అవతార మేమిటి—నీ బి. ఎస్ సి కాలినట్టే వుంది. కలం పట్టుగుంటా వనుకొన్నాను, మసి పట్టుగున్నావు.'

'రాత్రి డ్యూటీరా. నా కిప్పుడూ అంతే. అప్రెంటిసు ముగించి రెండేళ్లయింది కదూ మరి.'

'సరేలే వెళ్ళి మనిషిలా తయారవూ.'

'సీతారాం!'

'బజారు కెళ్లేడు తమ్ముడూ. రా, నీళ్లు సిద్ధంగా వున్నాయి.'

వాడు వెడుతూ అన్నాడు 'రాజా కేదయినా దాణా పడేశావా?' అని.

భోజనాలు చేస్తున్నంతసేపూ సంజీవి యేవో కబుర్లు చెపుతూనే వున్నాడు. అప్పటికీ యిప్పటికీ వాడిది వొకటే వాగుడు. అప్రెంటెసుగా చేరిన, కొత్తలో పదిహేను పౌనుల సుత్తితో మోదిమోది అరిచేతులు కాయలు కాసి పోతూంటే వాడు నిభాయించుకోలే డనుకునేవా రంతా. బలిష్ఠమైన శరీర మైనా అంత సున్నితంగా వుండేవాడు. ఇప్పుడొక యినుపమనిషిలా తయారయేడు.

'అన్నట్టు సంజీవీ, మన విశ్వం యెక్కడున్నాడురా?'

నేయి వడ్డిస్తూన్న లక్ష్మి చెయ్యి వణికి, మిల్లి గరిటె నా విస్తరిలో జారిపోయింది. 'అయ్యో' అని ఆమెవేపు చూసేను. ఆమె కళ్లు రక్తిమదేరి, ముఖం అదోలా మారి 'అయ్యో' అంది. కాని మిల్లి గరిటె జారిపోయినట్లు తెలియడాని కామెకు మరి రెండు మూడు సెకండ్లు పట్టివుంటుంది.

'ఆ పశువుగురించి నన్నడక్కుమీ. వాడుట్టి ఫూలు.'

'సరే దానికేం లే. ప్రస్తుతం వాడెక్కడున్నాడని నా ప్రశ్న' అంటూ అన్నంలో పడిన గరిటెని ప్రక్కగా విస్తరి బైటపెట్టేను.

'సంవత్సరం క్రిందటే బరంపురం వచ్చేడని తెలిసింది. ఉద్యోగానికి శెలవు పొడిగిస్తున్నాట్ట. అధికారుల కిష్టం లేదట. వాడికి ఖాతరే లేనట్టుంది'

'ఉత్తరాలు రాస్తాడా'

'ఆమధ్యవరకూ వ్రాసేవాడు. పోయిన డిశంబరులో వాడికి జబ్బుచేసిందంటే వాళ్లమ్మ వచ్చింది. వాడు తేరుకున్నాడు కాని వాళ్లమ్మ పోయింది.'

'ఆఁ!'

'చూట్టానికి వెళ్లేను. అత్తవారింటిలో వుండగా యిలాంటిది జరిగింది కదా అని కించలేదు. తల్లికి కర్మచేస్తూన్నాను కదా అని మాటలేదు. తన ఆరోగ్యం బాగులేదు కదా అని బెంగలేదు. వాడూ, ఫ్రెంచికటింగు మీసాలు, నవ్వుమొహం, నోట్లో హమేషా సిగరెట్టు.'

'అయితే వాడి ఆరోగ్యం బాగులేదా?'

'బాగేమిటి వోగేమిటి, అలాగే చింత కాయలా వున్నాడు. కాని ఆ వెధవ సిగరెట్లు కాల్చడం మాత్రం మానడు. పోయినవాళ్లు పోగా నలుగురు పిల్లలున్నారు. భార్య మళ్లీ సిద్ధంగా వుంది.'

'వాడికోసం కళ్లు కాయలు కాసిపోతున్నాయిరా. ఈపాళంగా వెడితే వాళ్లత్తవారింట్లో వుంటాడంటావా?'

'ఎవడి కెరుక భాయీ వాడు నావుద్దేశం ప్రకారం యెలాంటివాడంటే, వాడితో స్నేహం కట్టినవాళ్లందరినీ బెంగలో పడేసి, వాడు మాత్రం చుట్టుప్రక్కల పరిస్థితులు మరిచిపోయి చిదానందంగా వుంటాడు.'

'అలా అనకురా. వాడు చాలా మంచివాడు. వాడి కర్మ అలా వుంది.'

'వాడి కర్మేమిటి! చూడు యీ మనిషిని' అని లక్ష్మివేపు చూపించేడు.

లక్ష్మి చరచర వచ్చి పెరుగు వడ్డించి 'తమ్ముడూ, నీకు నోరెగుస్తూందే—పెద్దా పిన్నా లేకుండా...' అని గద్దించింది.

'పెద్దవాడే అక్కయ్యా. వాడిమీద నాకు భక్తి వుంది. కాని గౌరవం లేదు.'

నాకు పకాలున నవ్వు వచ్చింది.

'భక్తి వుంది గౌరవం లేదు. ఎంత తమాషాగా అన్నావు. నువ్వింకా కుఱ్ఱాడివే. మనుష్యుల్ని నువ్వేమిటి అర్థం చేసుకోగలవు. అందరూ అగుపించినట్టు వుండరు. నీకు అనుభవం తక్కువ. మాతో బంతిఆటలు ఆడుతూ, చదువుకుంటున్న రోజుల లోనే చుట్టలు కాలుస్తూండేవాడు. కామేశ్వరి జ్ఞాపకం వుందా...

'ఆ ... ప్రిన్సిపాల్ గారి అమ్మాయితో కొన్నాళ్లు...

'ఆ వాడే వాడే...వాడు నిన్న రైలులో కలిసేడు. కామేశ్వరికూడా నాకుమల్లే విశ్వానికి మంచి స్నేహితుడు. వాడూ నీలాగే విశ్వం పూచీ పేచీ లేని నిశ్చింత మనిషి అంటాడు.

'ఓహో వాడా,..మా వూళ్లో సినీమా ప్రొప్రయిటరు...' అంటూ లేచాడు సంజీవి.

'బ్రదర్ నువ్వు తాపీగా కూచో. నాకు నిద్ర కుమ్ముకొస్తూంది. రాత్రి మళ్లీ డ్యూటీ కదూ.

సంజీవి వెళ్లిపోయేడు కాని అంతవరకూ యేదో మాటాడుతున్న లక్ష్మి సుమారుగా మౌనం దాల్చింది. నేనా విషయం కని పెట్టినప్పటికీ, తెలియ నట్టే వూరుకున్నాను.

గతాన్ని బట్టి లక్ష్మికి యిష్టంలేని విషయాన్ని ప్రస్తావించాం అనుకున్నాను. ప్రతి విషయాన్నీ 'అతి' గా వూహించే తత్వంగలవాడి నవశంచేత, యీ ప్రస్తావన లక్ష్మి హృదయసాగరంలో నిద్రించి వున్న హాలా హలాన్ని మథించి తీసిందేమో, దానిని ఆమె శంకరుడేవలె కంఠంలోనే అదిమిపెట్టి వుంచిందేమో అనిపించింది.

భోజనానంతరం నేను కొంచెం విశ్రాంతి తీసుకున్నాను. సంజీవి కుంభకర్ణుడిలా నిద్రపోయి మూడుగంటలకు లేచి 'టీ' త్రాగి మళ్లీ పడుకున్నాడు. నాలుగింటికి లక్ష్మి పూరీ బంగాళా దుంపలకూర ఫలహారం చేసి నాకు పెట్టింది.

సుమారు రారుగంటలకు సంజీవి లేచి, వేడినీళ్లు స్నానంచేసి భోంచేసేడు. మకిలిడాంగరీ వేసుకుని, దానిమీద దర్జాఅయిన సూటు బణాయించేడు. పని స్థలం చేరగానే పై డాబు తీసి పారేస్తాడన్న మాట.

'రాజా, నేను వెడుతున్నా నువ్వు భోజనానికి తాపీగా కూచో. రాత్రి యేమీ ప్రోగ్రాం లేదా.'

'ప్రోగ్రామ్కేముంది. నువంటేనే యేదైనా.'

'అక్కయ్యా, దేశత సినీమాకి వెడదా మనుకుంటున్నావు. రాజా నువ్వు వెళ్ళం డివాళ.' లక్ష్మి అలాగే అంది. కాని నేనే అన్నాను 'రేపు నీకు శలవేకదా. అంతా కలిసిపోదాం' అని.

'రేపు 'షాజహాన్' చూద్దామోయ్. నాకీ తెలుగు సినీమాలంటే తలనొప్పి. లక్ష్మికి పద్యాలంటే సరదా. ఇటీవల సినీమాలలోంచి పద్యాలకు వుద్వాసన చెప్పేరటగా.'

నాకు పకాలున నవ్వు వచ్చింది. లక్ష్మికూడా నవ్వింది మందంగా.

'లక్ష్మి విశ్వంపద్యాలు చదవడం యెలా పొగిడేదో జ్ఞాపకం వచ్చిందా?'

నే నేదో ఆలోచిస్తున్నదానికి అంతరాయం కలిగింది. నిజానికి అది కారణం కాదు. వాడికి తెలుగు సినీమాలంటే తలనొప్పి. నాకు ఇండియన్ సినీమా లంటేనే రోత!

మరి నాతోబాటు లక్ష్మి యెందుకు నవ్విందో అది నేటికీ రహస్యమే. స్త్రీహృదయ మంతలోతైన మహాసముద్రం లేదు. దాని అట్టడుగున పుట్టిన చలనకారణంగా యే కెరటం యెప్పుడు పైకుబ్బుతుందో యెవడి కెరుక!

కాని లక్ష్మి 'అలాగే' అంది. ఆమెకు ఆశాభంగం కలిగించరాదని సినీమాకు వెళ్లడానికి నిశ్చయించేను. సంజీవి వెళ్ళిపోయేడు.

నాతోబాటు లక్ష్మిని భోజనానికి కూచోమన్నాను. కాని ఆమె వినలేదు. నేను భోంచేస్తున్నంతసేపూ ఆమె నిలబడేవుంది. నిగనిగ మెరుస్తూన్న ఆమె కళ్లలో సాధారణంగా యౌవనులకుండే 'జిజ్ఞాస' లేదు. సౌందర్యం తిరిగి విజృంభించిన ఆమెలో 'ముందుకు ముందుకు' అనిపించే వుద్రేకం లేదు. విశ్వం అనేవాడు. స్త్రీ తను తనుగా జీవించగలదు. తను తనుగా జీవించకుండా వుండగలదు. తను రెండు విధాలా వొకే సమయంలో జీవించగలదు. అనవసరంగా నాలో సమస్యలు పుట్టి నన్ను బాధిస్తున్నాయి. నేనేమిటో అనుకుంటున్నాను గాని ఆమెమనసులో యే ఆలోచనలు పరుగెడుతున్నాయి?

మేం బయలుదేరి వెడుతూంటే బహుళ తృతీయచంద్రుడు వుదయిస్తున్నాడు. టాంగాలో త్రోవ పొడుగునా లక్ష్మి నాసైనిక జీవితవిశేషాలు అడిగింది. నేనెంతో ధైర్యవంతుడినని ప్రశంసించింది. జానకిని, పసికందు రఘుని విడిచి యిన్నాళ్లూ యెలా వున్నానో అని ఆశ్చర్యం వెలిబుచ్చింది. తనను గురించి ప్రశ్నించడానికి ఆమె అవకాశం యివ్వలేదు. నాకు ధైర్యం కలగనూ లేదు.

సినీమానుండి యింటికి వచ్చేసరికి వొంటిగంటయింది. ఇంటిముందు ఆరామంలో మంచుతో తడిసిన చెట్లఆకులమీద చందమామ స్వర్ణకాంతులు మెరుస్తున్నాయి. ఆ కాంతులు ఆకుల్ని వుద్రేకపరచ

ప్రయత్నిస్తూంటే అవి మరింత కన్నీళ్లు విడుస్తున్నాయిగాని హృదయాంతర్గతమైన ఆవేదనని వ్యక్తీకరించలేకపోతున్నాయి.

నేను మంచాన్ని నడివాకిలిలో కీడుచుకున్నాను.

'మీకు మంచుపడుతుందా?'

'నాకు మంచు యెంతైనా పడుతుంది. తూర్పు బెంగాలులో, డిశంబరు నెలలో ఆరుబైట పడుకునే వాడిని'

ఆమె నడివాకిలిలోకి కాళ్లు పెట్టి వరండాలో కూచుంది. వరండాలోకి చంద్ర కిరణాలు సూటిగా పడక ఆమె ముఖం నాకు స్ఫుటంగా కౌపించడం లేదు.

'లక్ష్మీ, నిద్ర రాలేదా'

'తేలిపోయింది'

ఆమె స్వవిషయంగూర్చి భోగట్టాలు తెలుసుకోవాలని చాలా కుతూహలంగా వుంది. కాని యెలా ప్రస్తావించాలో తెలియడం లేదు. సూటిగా అడిగితే యేమనుకుంటుందో అని భయం. కాని ధైర్యం చేసేను.

'లక్ష్మీ, నీ ఆరోగ్యం యీ రోజులలో చాలా బాగున్నట్టుంది. వెనక ఆరేడేళ్ల క్రితం పూచిక పుల్లలా వుండే దానివి.' ఆమె తెచ్చుకోలు నవ్వునవ్వి నేలకేసి చూస్తూ అర నిమిషం గడిచేకా అంది.—'బాధపడడం పడకపోవడం మన మనస్తత్వం పైన ఆధారపడి వుంటుంది. మనస్సు చేత వొప్పిస్తే బాధ కూడా రుచిగానే మారుతుంది."

ఆమె శాస్త్రంలోకి దిగిపోతూంది. విషయం తెలుసుకుందికి వుబలాటపడుతూన్న నాకు శాస్త్ర చర్చ యిష్టం లేదు. ఇంకొకప్పుడైతే నే నీశాస్త్ర విషయమై ఆమెకొక వుపన్యాసం యిచ్చేవాడిని.

'నేనడిగిన దది కాదు. నీలో యీ మార్పెలా వచ్చిందా అని, నీ బ్రహ్మచారిణిజీవితం ముగియలేదని తెలుస్తూంది. వెనకటి నీ దుర్భరావస్థ తెలిసినవాడిని కనక, ప్రస్తుతపు నీ శాంతియుత జీవితానికి కారణం కనిపెట్టలేక పోతున్నాను.'

'నా బ్రహ్మచారిణి జీవితం ముగియడమేమిటి? నాజీవితాన్ని బ్రహ్మచారిణిగానే ముగిస్తాను. పువ్వులా కమిలిపోయే మానవహృదయా లున్నంతకాలం ప్రక్కనే పాషాణ కర్కశమైన మానవహృదయాలు కూడా వుంటాయి.'

'పొరబడ్డావు. విశ్వాన్ని తప్పుగా అర్థం చేసుకొన్నవాళ్లలో నువ్వూ చేరావు.'

ఆమె హృదయంలోని ఆవేశం కంఠంవరకూ వచ్చి ఆగిపోయి నట్టయింది.

'తప్పుగా అర్థం చేసుకొన్నానా? మీరు ఆరోపించిన నింద యెవరిపట్ల నిజమౌతుందో వారు త్రొక్కే మార్గంకూడా తప్పు దవుతుంది కదా నిజంగా.'

'అంతవరకూ నీవంటివారి చరిత్ర నిర్మల గంగా స్రవంతి అంత పూతమైనది. కాని ప్రతీదానిని మానవత్వపు కొలబద్దతో కొలిచి పరిమితి నిర్ణయించడం సరికాదు. విశ్వం నిన్నే కాదు. నీవంటి యంతో[illegible]ది సాధారణులని యిట్టే ఆకర్షించేను. నీకు ఆశాభ[illegible]ం కలిగించినదీ వాడు కాదు. పెద్దల నిర్ణయం ప్రకారం చివరికా భార్యమెడలో మూడుముళ్లూ వేసిందీ వాడు కాదు. వాడి పాట, ఆట నిన్నాకర్షించి వెంటనే వాడిని నీ హక్కు చేసుకుందికి ప్రోత్సహించేయిగాని వాడిలోని లోకాతీతత గ్రహించ నిచ్చేయి కావు.'

ఆమె రెండు నిమిషాలు మాట్లాడలేదు. కాని ఆ కాలంలో యేం వూహించుతూందో చెప్పలేను. నేను తిరిగి ఆరంభించేను.

'వాడొకొక్కప్పుడు నీకూ నాకూ వొంటరిగా వున్నట్టుండేవాడు. కాని నిజానికా సమయంలో ప్రఖ్యాత అమెరికన్ నటుడు 'రొనాల్డ్ కాల్మన్'తో సిగరెట్టు కాలుస్తూ కబుర్లాడుతూండేవాడేమో, లేకపోతే శ్రీశ్రీ తో గరం గరం సంఘర్షణ చేస్తూండేవాడో'

'ఆమె మనస్తరంగం కదనుతొక్కడం కూడా మాని వెనకకు పిల్లడుగులు వేస్తూన్నట్టనిపించింది. ఆమె తలెత్తి జాలిగా చూస్తూ అంది. 'నిష్కల్మషంగా ధర్మపద్ధతిలో మనసు చెప్పినట్టు చెయ్యగలను గాని, మీ విపరీత తర్కం నాకు అర్థం కాదు ఆ హృదయ దౌర్బల్యంతో బాధపడిన రోజులు జబ్బు దినాలుగా గ్రహించి, యిటీవల మనసు మార్చుకొన్నాను. ఆత్మశాంతి, యింట్లో శాంతి బలిపెట్టిన

రోజులు తిరిగి రాకుండా కట్టుదిట్టం చేసుకున్నాను. అందుకే నా ఆరోగ్యం తిరిగి తలెత్తింది.'

ఆమె యీ మాట లంటూంది గాని, గొంతు బొంగురు పోతూంది. సంగతి మితిమీరినందుకు విచారించినా, ఆమె పొరబాటు, ముఖ్యంగా అది విశ్వానికి సంబంధించింది కనక, ఆమెకు తెలియజెయ్యాలని నిశ్చయించేను.

'అయితే లక్ష్మీ విశ్వం నీ కిప్పుడు శత్రువన్న మాట.'

ఈ ప్రశ్నకి ఆమె యేడు సంవత్సరాల విస్మృతి పొరలు చీలిపోయేలా దీర్ఘనిశ్వాసం తీసింది. ఏడుపు గొంతుతో 'శత్రువూ కాదు, యెవరూ కాదు' అంది.

'ఇది మరొక అసత్యం. కాకపోతే అతనిపై పూర్తిగా విముఖత అభ్యసించిన నువ్వు, యెవరికోసం, యెందుకోసం బ్రహ్మచర్యం పాటిస్తున్నావు? అతడొక్కడే మోసగాడా, లేక పురుష జాతి అంతా మోసకారేనా?'

ఈ ప్రశ్నకి ఆమె తట్టుకోలేక పోయింది పొంగి పొంగి వచ్చే దుఃఖంచేత ఆమె ముఖం రెండు బాహువులతోనూ దాచుకుని వెక్కి వెక్కి కుమిలింది. సందులు తిరుగుతూ, అలలు రేగి మహా వేగంతో పరుగెత్తి వచ్చే సరిత్ప్రవాహంవంటి ఆవేదనకి ఆగలేక, కంటికీ మంటికీ యేకధారగా హోరని యేడ్చింది.

నేనామెను వోదార్చేను. విస్మరించి శరీరాన్ని సుఖపెట్టేకన్న, స్మరించి కన్నీరు కార్చడంలోనే నిజమైన ఆనందం కలదని ఆమెకు నచ్చజెప్పేను. సరిగా అదే సమయానికి చంద్రకాంతి ఆమె వున్న వరండాలోకి ప్రవేశించింది. ఈ స్త్రీ హృదయాన్ని యింత చమత్కారమైన మోసంలో వుంచిన విశ్వాన్ని చూడడానికి నా హృదయం మరీ ఆతృత పడింది. ఆరు నూరైనా ఆ మరునాడే బరంపురంలో పడి విశ్వాన్ని తనివితీరా కౌగిలించుకోవాలని నిశ్చయించేను.

ఉదయాన ఐదుగంటల బండీలో నే వెడిపోతానంటే సంజీవి వస్తే గాని వెళ్లడానికి వీల్లేదని లక్ష్మి పట్టు పట్టింది.

ఆ మరునాడాదివారం. సంజీవికి శలవురోజు. వాడూ నేనూ యెన్నో కబుర్లు చెప్పుకొన్నాం. లక్ష్మిలో చూచాయిగా అగుపిస్తూన్న మార్పును సంజీవి గమనించేడు. వాడితో నేను గతరాత్రి జరిగిన విషయం సవిస్తరంగా చెప్పేను.

నన్ను మెయిలుకు దిగబెట్టడానికి వాళ్లిద్దరూ వచ్చేరు. సంజీవి వటవట అదే వాగుతున్నాడు. లక్ష్మి మౌనంగానే వుంది.

మెయిలు వచ్చింది. పెట్టెలో నా సామానులు సర్దడం అయింది. లక్ష్మి చేతి సంచీలోంచి వొక డబ్బా తీసి నా ముందు బల్లమీద వుంచింది.

'ఇదేమిటి?'

'మున్నీలాల్ రసగుల్లా'

'లక్ష్మి నాకు తీపి సయించదని నీకు తెలుసుగా'

సంజీవి తల బుకింగుఆఫీసు వేపు తిప్పుకున్నాడు. లక్ష్మి అడుగు పెదవిపంటితో నొక్కుతూ కొద్దిసేపు నేలకేసి చూసి గండుమీలవంటి నేత్రాలు క్రమంగా కిటికీగుండా మిలమిల మెరిసే కోటితారకలుగల ఆకాశంవేపు మళ్లించింది. తుమ్మెదరెక్కలవంటి ఆమె రెప్పలనంటి కన్నీటిముత్యాలు మెరిసేయి. ఆమె నాతో యేదో చెప్పినట్టయి 'అలాగే' అన్నాను.

రైలు కదిలింది. తిరిగి నా ఆలోచనలు రైలులా పరుగెడుతున్నాయి. లక్ష్మిజీవితసాగరం మథిస్తే పుట్టిన హాలాహలం యీ రసగుల్లా. దానిని భరించగలిగిన వాడొక్క విశ్వనాథుడే. నాకు వెళ్ళిపోయిన రోజులు జ్ఞాపకాని కొస్తున్నాయి.

మేము నాటకాలు వేసే రోజులలో సంజీవి తండ్రి వాల్తేరుస్టేషను చిన్నమాస్టరు. ప్రతి రాత్రీ రిహార్సెల్సుకు వాళ్లింటికి వెడుతూండేవాళ్లం. విశ్వం మా అందరికీ పెద్ద. వాడు పద్యాలు విప్లవగీతాలు చదువుతూంటే గుండెలు దద్దరిల్లేవి. లక్ష్మికి వాడిమీద ప్రేమ ఆనాడు మొలకలెత్తింది.

రైలు చీకటిని చీల్చుకుని వుక్కుగుఱ్ఱంలా పోతూంది. అర్ధరాత్రి దాటింది. చిన్నతుషార వర్షం పడుతూంది. ప్రకృతి చెమ్మగా వుంది. చందమామ నజ్జుగా మేఘాలమాటునుంచి ప్రయాణిస్తూ వుండుండి అగుపిస్తున్నాడు.

ఖురదారోడ్డు స్టేషనుకు మైలివతల రైలు హటాత్తుగా ఆగిపోయింది. ఎవరో స్త్రీ ఆత్మహత్య చేసు

ఉంది. స్టేషనునుంచి రైల్వేఅధికారులు చాలామంది వచ్చేరు. ఆ నిర్భాగ్యజీవి నిర్భిన్నశరీరాన్ని చూడడానికి యెందరో ప్రయాణీకులు దిగేరు. నేనూ దిగి తిరిగి పెట్టెలో ప్రవేశించి, ద్వారంవద్ద నిలబడి చూస్తూన్నాను. క్రిందనుంచి వొకస్త్రీ కంఠం నన్ను పిలుస్తూంది.

'రాజారావుగారూ, దయచేసి కొంచెం చెయ్యి ఆసరా యివ్వండి.'

నేనాశ్చర్యపోయేను. ఎవరీమె! అక్కడ నేల చాలా దిగువగా వుంది. పైగా యినపతీగెలు మెట్లంగి రాళ్లూ వున్నాయి. ఎవరోస్త్రీ బండీ యెక్కలేక పోతూంది కామోసు. కాని ఆమెకు నా పేరెలా తెలుసు!'

నా చెయ్యి ఆసరామీద ఆమె లోనికి వచ్చి నా ముందు నిలబడి నమస్కారం చేసింది.

'మరిచి పోయేరా?'

'ఎవరు...నువ్వు...వసుంధరవి కదూ...'

'హమ్మయ్య' అయితే మరిచిపోలేదు. ఏదో ఆలోచిస్తున్నారు. మీ ఆలోచన లింకా అలాగే వున్నాయా బాబూ?'

'ఎక్కడుంటున్నావు వసుంధరా?'

'ఖురదాలో మిమ్మల్ని చూస్తే నాకెంతో ఆనందంగా వుంది. మీ రెక్కడికి వెడుతున్నా ఖురదాలో మాత్రం యిప్పుడు దిగితీరాలి' నే నాలోచిస్తూన్నట్టు గ్రహించింది.

'నాయింట్లో దిగమనడానికి ధైర్యం లేదు బాబూ. మన సూర్యనారాయణగారు ఖురదా స్టేషనులో టిక్కట్లబాబు. వారింట్లో దిగండి. వారిప్పుడు డ్యూటీమీదే వుంటారు.'

'వసుంధరా, నన్నిప్పుడు బలవంతం చెయ్యకు. నేనొక అవసరమైన పనిమీద బరంపురం వెడుతున్నా. ఈ మాటు వస్తా'

'అమ్మో! ఇప్పుడు మిమ్మల్ని వదిలేస్తే, ఆ చచ్చిపోయిన మనిషిలా పట్టాలమీద తల పగలేసుకోనూ. మీరు దిగకపోతే నేను చచ్చిపోయినంత వొట్టు. నన్ను మీరు కైమా చేసుకు తిన్నట్టే'

నాకు పకాలున నవ్వు వచ్చింది. 'నీ తురక మాట లింకా పోలేదు'

'బాగా చెప్పేరు. మీరు కాబట్టి అని వూరుకున్నారు. ఆ విశ్వంబా బైతేనా, చుఱ్ఱుమని వేసే వారే.!

నాకు మరీ నవ్వు వచ్చింది.

తెల్లవారుఝామున ఐదుగంటలకు రైలు ఖురదారోడ్డు స్టేషను చేరింది. నే నెంత వద్దంటున్నా వసుంధర తిన్నగా బుకింగుఆఫీసుకు పరుగుతీసి సూర్యంతో చెప్పింది. వాడప్పుడే డ్యూటీనుంచి విడుదలయ్యేడు. ఎగకట్టిన పంచ, నోట్లో అరంగుళం చుట్టతో నే నున్న పెట్టెవద్దకువచ్చి నన్ను అమాంతంగా కావలించుకున్నాడు.

'పేరహమ్మద్, పీరహమ్మద్, ఒరే సాయిబూ' అని కేకవేసేడు. కలాసీ రాగానే 'ఏ బాబూ కా సామాన్ ఘర్ పహుంచాదో ఔర్ అమ్మాసే కహో యేక్ మెహమాన్ ఆం యేహై' అని అరిచేడు.

మరి నామాట వినలేదు. వాడంతే. అట్లాసు లాగ ఆరున్న రడుగుల మనిషి. అరిస్తే యెదుటివాడి గుండె లదురుతాయి.

ఆ సమయంలో వుదయించ నున్న సూర్యుడి లేలేత వెలుతురుకు చీకటివలె, వసుంధర అదృశ్యమై పోయింది. నేనూ సూర్యం వాడిల్లు చేరుకున్నాం.

సూర్యం నోరు కిల్లుగానుగ. పైగా వాడు సకల గుణాభిరాముడు. కాని పెద్దమనిషి. మా నాటకాలలో రాక్షస పాత్రలు, త్రాగినవాడి పాత్రలు, హాస్యపాత్రలు ధరించేవాడు. కవి వొకలా వ్రాస్తే వాడు మరొకలా అనేవాడు.

వాడు పెళ్లిచేసుకుంటాడని కాని, సంసారం సరిగా చేస్తాడనికాని యెన్నడూ వూహించనైనా లేదు. మాతో నాటకాలలో నటించడానికి ధైర్యం చేసి వచ్చిన స్త్రీలు పిడి వాలకం చూసి పారిపోయేవారు. వాడి హావభావ చేష్టల చూసినవా రెవ్వరూ వాడిని పెద్దమనిషి అనుకోరు. అందులో స్త్రీలు మరీని.

ఒకమారొక అమ్మాయి వచ్చింది. చిన్నది. అనుభవం తక్కువది. అప్పుడు రాత్రి పదిగంటలౌతుంది. అంతా ఆమెను పాటలు పాడమంటున్నారు శారీరం యెలా వుంటుందో చూదామని. ఏ పాట పురమాయించినా రాదని చెపుతూంది. ఐదు

నిమిషాలు పోయేకా సూర్యం పడుకున్నవాడు వుభేత్తుగా లేచి 'నీకొచ్చినపాట యేడుస్తూ' అని వురిమేడు. ఆపిల్ల వెక్కి వెక్కి యేడవ నారంభించింది. విశ్వం సూర్యాన్ని పడతిట్టి ఆ పిల్లను బుజిరించేడు. దగ్గరకు వెళ్లి, గడ్డంపట్టుకుని 'అమ్మడూ భయపడకు, మావాడి తీరే అంత' అంటే ఆమె కొంచెం స్తిమితపడబోయింది. మళ్లీ సూర్యం 'అమ్మా, కూచమ్మా నిన్ను మింగేస్తు, పాడు తల్లీ' అని గడ్డం పట్టుగోపోతే, ఆపిల్ల గోరువంకలా వణికి విశ్వం వెనక నక్కింది. మర్నాడా పిల్ల ఫికరులేదు. విశ్వం సూర్యాన్ని తిట్టినతిట్లు యిక్కడ వ్రాయలేను.

ఆ వేళ సూర్యం పనిలోకి వెళ్లనవసరం లేకుండా యేర్పాటు చేసుకున్నాడు. సాయంత్రమేడుగంటలకు భోంచేసేం.

'రాజా! నీ దగ్గరున్న మంచి డ్రెస్ వేసుకో. ఇవాళ వొక ప్రత్యేకమైన స్థలానికి వెడుతున్నాం.'

'ఎక్కడికో.'

'నీకా పోయే కాలమే పోయింది కాదు. శుభం అని బయలుదేరుతూంటేయేమిటా అపభ్రంశ ప్రశ్న."

వాడు తెల్లమడత గ్లాస్కో పంచ ధరించేడు. గ్లాస్కో కల్లీలాల్చీ తొడిగేడు. క్రిమిన్ను బొత్తాములు, జేబులో జొపిన్తూ నోట్లు. ఉల్లిపాముతొలువంటి ఆకుజోడు. సెంటుపూసుకున్నాడు. వాడు అచ్చమైన రంగేళీ ఆంధ్రుడిలా తయారైతే, నేను అప్పుడే ఓడ దిగిన సీమ దొరలా తయారయేను. వాడి ఫోషుక్కు చూస్తే అపళంగా బనారస్ 'ఛప్పన్ మాళీ' దగ్గరకు కూడా వెళ్లడానికి తగినట్టున్నాడు.

ఆకాశం నిర్మలంగా వుంది. చుక్కలు తళతళలాడిపోతున్నాయి. రివటగాలి వుల్లాసకరంగా వుంది. సందులు గొందులన్నీ తిరిగి వొకయింట్లో దూరేం. గుమ్మంలోనూ, మేడ మెట్లమీదా చీకటిగా వుంది. మేడమీదకు వెళ్లినదగ్గరనుండీ వాతావరణం మారిపోయింది. మందమైన దీపకాంతి గల మూడు వరసగదులు; గుమ్మాలకు కిటికీలకు సిల్కు తెరలు. వరండామీద వొక ముసిలాడు పడుకున్నాడు.

'సలామ్ సాబ్'

'ఖులాసాగా వున్నావా వుర్ఫాన్, ఇందు' అని సూర్యం డబ్బులిచ్చేడు. తెర తొలగించుకుని మధ్య గదిలో ప్రవేశించగానే సూర్యం 'ఉర్ఫాన్, వీధి తలుపు బంద్ చెయ్యి' అన్నాడు.

ఆగది చాలా విశాలంగా వుంది. ఎదురుగోడకు యెడమవేపు పెద్ద పందిరిమంచం, పాలతెలుపు పరుపు తలగడాలు, బాలీసులు. కుడివెంపు రెండు సోఫాలు, కుర్చీలు. మంచాని కెదురు గోడదగ్గరగా చిన్న టేబిలు నాలుగుకుర్చీలు. అది వొక జమీందారు యొక్క గాని, పెద్ద వరవిలాసినియొక్క గాని శయానాగారంలా వుంది. నేను సోఫాలో కూచున్నాను. సూర్యం స్వంతయిల్లులా పచారు చేస్తున్నాడు చుట్ట కాలుస్తూ.

ఐదు నిముషాలు గడిచాకా ఊర్వసి తలలోంచి జారిపడిన సంపెంగపువ్వులా వాలిపడింది మా ముంగు. నా వేపుచూసి బుగ్గమీద కుడిచేతి చూపుడువ్రేలు పెట్టుకుని, కళ్లు వయ్యారంగా తిప్పుతూ 'ఎవరు గెల్చారు' అంది. మరు నిముషంలో ఆమె వినయపూర్వకంగా 'బాబూ మీ రిలా రావడం, మా వూళ్లో దిగకుండా వుండడం నా' అంది.

'కబుర్లు చెప్పడమేనా మా గొంతులలో యింత వేడి వేడిగా పొయ్యడముందా' అన్నాడు సూర్యం.

'ఎందుకురా, త్రోవలో నేగా టీ తాగాం.'

'టీ! వెధవ టీ యెవడికి కావాలి, పాలోయ్, పాలు' 'జౌను రాజారావు బాబూ, సూర్యంగారికి పాలు కావాలి. చంటిపిల్లలు మరి.'

'అబద్ధం కాదు. నీవంటి నెరజాణదగ్గర యెవ్వరైనా, యెప్పుడైనా చంటిపిల్లలే. ఏం రాజా!'

నాకు నోట మాట రావడంలేదు. వసుంధరను నే నిదివరలో చూసినప్పుడు గులాబీ మొగ్గ. నేడో! రేకులు విచ్చుకున్న పువ్వు! ఆమె నవ్వితే గదిలో వెలుతురెక్కువైపోతూంది. నే నిలా ఆలోచిస్తూంటే వాళ్లిద్దరూ యేమిటో కళ్లతోటే మాట్లాడుకుంటూ నవ్వుకుంటున్నారు. నేను తెలివితెచ్చుకుని 'ఏమిటి' అన్నాను.'

'ఆ యేమీ లేదు. నీకు మతిపోయినట్టుంది. ఏదైనా మందు పొయ్యమని వసుతో చెపుతున్నాను.'

వసుంధర కళ్లింతలుచేసి వుదాసీనంగా నవ్వుతూ 'నీ మాటసున్నితం యెప్పుడూ వొక్కలాగే వుంది' అంది. ఈ సంభాషణ జరుగుతూంటే

ఉర్చాను, మరొక కుఱ్ఱవాడు వచ్చి, టేబిలు గది మధ్య అమర్చి కుర్చీలు వేసేరు. ఒక కుర్చీమీద కూచుంటూ సూర్యం, 'తప్పేమిటి, రాజా నీకు మతిదివరసే కదా' అన్నాడు. నేనుకూడా వొక కుర్చీ మీద కూచున్నాను. వసుంధర కూచుంటూ 'మీ నోటికి తలుపులూ తాళాలు లేవు. విశ్వం బాబుంటే మీ కిప్పుడు బుద్ధిచెప్పి వుండురు' అంది.

'వాడి వూసెత్తకుమీ, నాకు వళ్లు మండుతుంది.'

'ఔను కాని సూర్యం, విశ్వ మెక్కడున్నాడురా?'

'నీకూ వాడి బాధే పట్టుకుంది. ఇప్పు డిప్పుడే వాడి సంగతి మరిచి పోగలుగుతున్నాను. మళ్లీ నువ్వు రేకెత్తించకు.'

'నీకు తెలీదురా. వాడిని చూడాలని తహతహలాడిపోతున్నాను. చెప్పరా యెక్కడున్నాడో'

'ఆ మూర్ఖుడి వూసెత్తవద్దురా మహాప్రభో, నీకు నమస్కారం!'

'ఏమిటి బాబూ, ఆయనమీ దలా విరుచుకుపడతారు. ఉదయం లేస్తూనే ఆయన్ని తల్చుకుని దండం పెడతాను.'

'హమ్మయ్య' అనుకున్నాను నేను. వాడిని కొంచెం గ్రహించగలిగిన వ్యక్తి జోపించిం దిప్పటికి.

'వసుంధరా, నీకు విశ్వం జ్ఞాపక మున్నాడా?'

'జ్ఞాపకమా, నే నీ రోజున యిలా కలకలలాడుతున్నానంటే ఆయన పెట్టిన భిక్షే.'

'బుగ్గలు సాగదీసేవాడుగా' అన్నాడు సూర్యం.

'బుద్ధిచెప్పినవాడు గుద్దితే నేమయా' అన్నారు పెద్దలు. ఆయన చెప్పిన నాలుగుముక్కలే నన్నివాళ హాయిగా బతకనిస్తున్నాయి. నిజానికి ఆయనమీద నామనసు పోయింది. కాని నిప్పులాంటి ఆమనిషి దగ్గరకు చేరలేకపోయేను. ఒక్క తెలుగుముక్కయినా సరిగా పలకలేని నాచేత కవిత్వం వ్రాయించేరు. సూర్యం బాబిలా తిట్టడాని కాయన దోషమేమిటో తెలీదు.

ఓనాడు రాత్రి పన్నెండింటికి నాచేత నాటకంలో ముక్కలనిపిస్తున్నారు. ఏం బుద్ధి పుట్టిందో నన్ను హటాత్తుగా కావిలించుకుని ముద్దెట్టుకున్నారు. నేను విదిలించుకో లేదు. యీసడించలేదు. కాని వారే మూడు రోజులవరకూ నొచ్చుకున్నారు.'

సూర్యం మధ్యలో ఆమెను గసిరి ఆపేడు 'సరేలే యేదో యేడిసేరు. ఆ సీసా తీసుకురా' అన్నాడు. వసుంధర సీసా తెచ్చింది. సూర్యం ధగధగ మెరిసే వైను మూడు గ్లాసులలో పోసేడు. ముగ్గురం బంగాళా దుంపల పకోడీ, ఆమ్లెట్ ఫలహారం చేస్తూ వైను సేవిస్తున్నాం.

'విశ్వం ఎక్కడున్నాడురా?'

'మూడేళ్ల క్రిందటినుంచీ వాడు సరీగా ఆఫీసుకు వెళ్లడం లేదట. ఎప్పుడూ శలవేట. అప్పుల పాలయిపోయేట్ట. నీ కెందుకే విశాఖపట్టణం వుద్యోగం, కలకత్తా ఆఫీసులో నా కొక సీసా స్నేహితుడున్నాడు. వాడిద్వారా నీకే ప్రాంతంలో వుద్యోగం వేయిస్తాను రమ్మంటే పసేమి వినలేదు. నిరుడు బరంపురంలో తల్లిపోయింది. వీటన్నిటికీ తోడు ఆరోగ్యం బాగులేనివాడి కా సిగరెట్లేం! అదే కాల్చడమూ!

మూడు నాలుగు నెలల క్రితం లేఖ వ్రాసేడు. బరంపురంలో వాళ్లత్త వారింట్లో నే వున్నాడు.'

'వాడి ఆరోగ్యం యెలావుంది?'

'ఎలా వుంటుంది? టి బి వచ్చిందిట. కాని సిగరెట్లు మాన లేకపోతున్నాడట.'

వసుంధర నేనూ వొకేసారి 'రామరామ' అన్నాం.

'రామరామా లేదు, బొల్లిగద్దా లేదు. మరి వాడెందుకు పుట్టేడు? మనవంటివాళ్లతో స్నేహం కట్టి మనని చంపుకుతినడానికి. వాడి కే బాధా లేదు. హాయిగా వుంటాడు.'

వసుంధర కళ్ళంట నీళ్లు వస్తున్నాయి. 'ఏం మాటలు బాబూ మీవి. ఇన్నాళ్లూ యీ సంగతి చెప్పేరు కారు. ఎలావుందో పాపం. వెడదామా అండీ' అని సూర్యం వే పొకసారి చూసి, వెంటనే చూపు నావేపు మళ్ళించింది జాలిగా, ఆతృతతో కన్నీళ్ళతో.

తరవాత ఐదునిమిషాలసేపు యెవ్వరం మాట్లాడ లేదు. ఆ వెనక రాత్రి ఒంటిగంటవరకూ కబుర్లు సాగేయి. నా మనసక్కడ లేదు. ఒంటిగంటకు నాకు కొంచెం చెరుపు మగుపు అవస్తపడుతూంది. వెళ్ళి పక్కగదిలో పడుకున్నాను.

తెల్లవారుఝామున లేచి యింటికి మరలేము. సుమ్మంవరకూ దిగబెట్టడానికి వచ్చి వసుంధర విశ్వం భోగట్టా వెంటనే వ్రాయమంది.

ఇంటికి చేరేకా సూర్యం తన భార్యతో బొంకేడు నాటకానికి వెళ్లేమని.

ఖురదారోడ్డునుంచి వెడిపోతున్నప్పుడు ప్లాట్‌ఫారంమీద సూర్యం నా రెండు భుజాలూ పట్టుగుని కళ్లలోకి చూస్తూ యిలా అన్నాడు. 'బ్రదర్ విశ్వంవిషయంలో నీ మనసును నొప్పించేను కామోసు. కాని నా వుద్దేశం అదికాదు. నిజానికి నా వూహప్రకారం వాడుత్త చాతకానివాడు. ప్రేమించి హృదయం కాళ్లముందు గుమ్మరించినవారిని ఆదరించలేకపోయాడు. దగ్గర వుంటే పోషిస్తామన్న పెద్దలవద్ద వుండలేకపోయేడు. పిల్చి మంచి వుద్యోగం యిప్పిస్తానని బ్రతిమాలితే రాలేకపోయేడు. సంపాదించినది దాచుకోలేక పోయేడు. ప్రేమికుల, స్నేహితుల, అభినందించిన వారి, ఆదరించినవారి హృదయాలలో ఆరని చిచ్చు పెట్టి, తన సంసారం ధ్వంసంచేసుగున్న బ్రతకలేని వాడు విశ్వం. కానైతే వాడిమీద నాకున్న ప్రేమకు వానకాలంలో పొంగే గోదావరినదే సారూప్యం. నువ్వెంత బాధపడుతున్నావో కూడా నాకు తెలుసు. నీ బాధా నా బాధా వొక్కటే. నన్ను క్షమించు. వాడి కెలా వుందో వ్రాయి.'

వాడి పాషాణహృదయం కూడా కరిగి రెండు కనుకొలకుల్లో మెరిసింది.

రైలు మళ్ళీ కదిలింది. అది పరుగెడుతూంటే ఆశబ్దం నా గుండెల్లో 'బరంపురం బరంపురం' అని ప్రతిధ్వనిస్తూంది. తెలతెలవారుతూంటే మెయిలు బరంపురం చేరింది. అవేళ ప్లాట్‌ఫారం నిర్మానుష్యంగా వుంది. అక్కడక్కడ కాకులు గుంపులుగా చేరి అరుస్తున్నాయి. నేను స్టేషనులో నే స్నానంచేసి 'టీ' త్రాగి బయలుదేరేను. విశ్వం అత్తవారిల్లు కనుక్కొని చేరేసరికి తొమ్మిదైంది.

వీధి నడవలో వొక ముసలాయనకూచున్నాడు. విశ్వం అత్త వారిల్లిదేనా అని ప్రశ్నించేను. అతడే నని తలవూపేడు. 'రాజారావు అనే స్నేహితుడు వచ్చేడని విశ్వంతో చెప్పండి' అన్నాను. అతడు నుదుటిమీద చెయ్యివేసుగుని 'మా అల్లుడికి మీ కబురందజేసే శక్తి మానవులలో లేదు. అతడు పదిరోజుల క్రిందట గోపాలపురంలో శాశ్వతంగా కళ్లు మూసేడు' అన్నాడు.

అప్పుడు నా కగుపిస్తూన్న ప్రతీదీ యీతకొడుతూంది. ప్రపంచం గిరగిర తిరుగుతూంది. ఆ దృశ్యంలో అక్కడ లేని వ్యక్తులూ, వస్తువులూ కూడా తిరుగుతున్నాయి. ఎన్ని హృదయాలలో అన్ని మాటలు.